www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 25 మే 2023

ఆర్‌డిఓగా బాధ్యతలు స్వీకరించిన భాస్కర్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట ఇన్‌ఛార్జి ఆర్‌డిఓగా కె.భాస్కర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సబ్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు అన్నమయ్య జిల్లా సంయుక్త కలెక్టర్‌గా ప్రమోషన్‌పై బదిలీ చేశారు. ఆయన స్థానంలో రాజంపేట తెలుగుగంగ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న భాస్కర్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన ఆర్‌డిఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య వరద గ్రామాలైన పులపత్తూరు గ్రామంలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయన విస్తృతంగా పర్యటించారు.

ఆర్‌డిఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న భాస్కర్

రైతులకు న్యాయం చేయలేని సిఎం జగన్

- గండికోట, రాజోలి నిర్వాసితులకు న్యాయం చేస్తాం
- తాగు, సాగునీటికి శాశ్వత పరిష్కారం
- టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్

మహిళలతో మాట్లాడుతున్న లోకేష్

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్/పెద్దముడియం

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సొంత జిల్లాలోనే రైతులకు న్యాయం చేయలేకపోతే రాష్ట్రంలోని రైతులకు ఏం న్యాయం చేస్తారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీనే విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులను ఆదుకుంటామని పేర్కొన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 109వ రోజుకు చేరుకుంది. బుధవారం వైఎస్‌ఆర్ జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం పెద్దముడియం మండలంలోని సుద్దపల్లె విడిది కేంద్రం నుంచి జంగాలపల్లె, జె.కొట్టాలపల్లె, ఉప్పలూరు, బలపనూరు క్రాస్, ఎస్.కొట్టాలపల్లె మీదుగా పెద్దపసుపుల విడిది కేంద్రం వరకూ పాదయాత్ర సాగింది. ఆయా ప్రాంతాల్లో గండికోట ముంపువాసులు, రాజోలి ఆనకట్ట బాధితులు, రైతులతో మాటామంతి, ముఖాముఖి, సమావేశాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పాదయాత్ర సందర్భంగా పలు చోట్ల లోకేష్ మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి రాక ముందు రైతుల రాజ్యం వస్తుందని చెప్పి అధికారంలోకి వచ్చాక రైతుల ఆత్మహత్యలు అధికంగా జరిగాయన్నారు. మోసపూరిత వాగ్దానాలు, నెరవేర్చలేని హామీలు ఇచ్చారన్నారు. తాము అధికారం కోసం అబద్ధం చెప్పి మోసం చేయలేమన్నారు. ఇంత వరకు గండికోట ముంపు వాసులకు నిజమైన లబ్ధిదారులకు నష్టపరిహారం అందుకుండా ఉంటే వారికి అధికారంలోకి వచ్చాక కచ్చితంగా అందజేస్తామన్నారు. రాజోలి ప్రాజెక్టు బాధితులు అడిగిన ప్రాజెక్టని నారా చంద్రబాబు నాయుడుతో చర్చించి తెలియజేస్తున్నారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలలో యుద్ధ ప్రాతిపదికన అధికారంలోకి వచ్చిన వెంటనే మౌలిక సదుపాయాలు కల్పించి ప్రతి ఇంటికీ నీటి కొళాయిలను అందిస్తామన్నారు. రెండు దశాబ్దాలుగా రాయలసీమలో తాగు, సాగు నీరు సమస్య ఉందని దానికి శాశ్వత పరిష్కారం ఈ ప్రభుత్వం చేయలేకపోయిందన్నారు. ఇది కచ్చితంగా వైసిపి ప్రభుత్వ వైఫల్యమన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే గోదావరి కృష్ణ నదులను అనుసంధానం ద్వారా తాగు, సాగునీరు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. రాజోలి ప్రాజెక్టు బాధితులు, రైతులు, గండికోట ప్రాజెక్టు ముంపువాసులు తమ సమస్యలను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి లోకేష్ దృష్టికి తెచ్చారు. తమ నియోజకవర్గ పరిధిలోని సమస్యలను తెలుసుకుని టిడిపి ప్రభుత్వం రాగానే శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. రాజోలి బాధితులు 20 లక్షల పరిహారం ఇవ్వాలని కోరారు. గండికోట ముంపు బాధితులు జగన్ ఇచ్చిన హామీ ఇంతవరకు అమలుకాలేదు దానిని పెంచి ఇవ్వాలని, ముంపు కాలనీలలో మౌలిక సదుపాయాలు సరిగ్గాలేవని, పూర్తిస్థాయి పంచాయితీలను ఏర్పాటు చేసి అభివృద్ధి చేయాలని కోరారు. పాదయాత్రలో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, ఎమ్మెల్సీ శివనాథ్‌రెడ్డి, జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పొన్నతోట మల్లికార్జున, రైతులు, ముంపు బాధితులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు విద్యా దీవెన వరం : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

పేద విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన వరంలాంటిదని కలెక్టర్ గిరీష అన్నారు. బుధవారం తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గ కేంద్రంలో బహిరంగ సభ నుండి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వర్చువల్ విధానం ద్వారా 2022- 23 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండవ విడత జగనన్న విద్యా దీవెన లబ్ధి మొత్తాన్ని ల్యాప్ టాప్ బటన్ నొక్కి అర్హులయిన విద్యార్థుల తల్లుల ఖాతాలో జమచేశారు. ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ విసి హాలు నుంచి జగనన్న విద్యా దీవెన పథకం సంబంధించి ఆర్థిక లబ్ధిని విద్యార్థుల తల్లుల ఖాతాల్లో నగదు జమ చేసే కార్యక్రమంలో కలెక్టర్ గిరీష, డిఆర్‌ఓ సత్యనారాయణ, జిల్లా ఎస్‌సి సంక్షేమ, సాధికారత అధికారి జాకీర్ హుస్సేన్, జిల్లా బిసి వేల్ఫేర్ అధికారి సందప్ప, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి అబ్బులం, వివిధ సంక్షేమ అధికారులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లులు పాల్గొ న్నారు. జిల్లాలో జగనన్న విద్యా దీవెన కింద 31,759 మంది విద్యార్థులకు గాను అర్హులైన 28,936 మంది తల్లుల ఖాతాలలో రూ.26.94 కోట్లు జమ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేదరికం కారణంగా ఏ విద్యార్థి ఉన్నత చదువులకు దూరం కాకూడదు చదువుల ఖర్చుతో తల్లిదండ్రులు అప్పులపాలు కాకూడదన్న సమున్నత లక్ష్యంతో జగనన్న విద్యాదీవెనను ప్రభుత్వం ప్రవేశపెట్టిందాన్నారు. ఈ పథకం కింద ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే అర్హులైన పేద విద్యార్థులు కళాశాలలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజుల మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తోందన్నారు. కాలేజీల్లో జవాబుదారీతనం పెరిగేలా, విద్యార్థుల తల్లులకు ప్రశ్నించే హక్కు కల్పిస్తూ, తల్లుల సాధికారతకు పట్టం కడుతూ నేరుగా వారి ఖాతాల్లోనే ప్రభుత్వం జమ చేస్తోందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ గిరీష

శ్రామిక జనపక్షపాతి 'కేతు'

కేతు భౌతికయానికి నివాళులర్పిస్తున్న సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

ప్రజాశక్తి - కడప అర్బన్

అభ్యుదయ సాహిత్యం కోసం అవిశ్రాంతంగా కషిచేసిన శ్రామిక జనపక్షపాతి కేతు విశ్వనాథరెడ్డి మరణం పార్టీకి తీరని లోటు సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ అన్నారు. బుధవారం స్థానిక సింగపూర్ టౌన్‌షిప్‌లోని కేతు విశ్వనాథరెడ్డి పార్థివదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ కేతు విశ్వనాథరెడ్డి ఇక లేరంటే నమ్మశక్యంగా లేదన్నారు. తెలుగు లెక్చరర్‌గా పనిచేశారని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారని చెప్పారు. మాజీ ఎంపీ ఎద్దుల ఈశ్వరరెడ్డి, ఎన్.శివరామరెడ్డి, జె.వెంకటరామిరెడ్డి లాంటి రాజకీయదు రంధరులతోపాటు. గజ్జెల మల్లారెడ్డి, వైసిపి రెడ్డి లాంటి సాహిత్యవేత్తలతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉండేవారి పేర్కొన్నారు. పార్టీ యెడల అకుంఠిత గౌరవభావం కలిగి ఉడేవారి చెప్పారు. 'కడప గ్రామాలు నామాలు' పేరుతో పరిశోధన చేశారని తెలిపారు. కథలకు వన్నె తెచ్చారన్నారు. అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షునిగా అభ్యుదయ సాహిత్యం కోసం, శ్రామిక జనం కోసం, కరువు పీడిత రాయలసీమ ప్రాంత సమస్యలపై సాహితీ పోరాటం నడిపారన్నారు. సాహిత్యంలో పరిశోధనలు ప్రోత్సహిస్తూ ఎంతోమంది భావి భారత కవులను తీర్చిద్దారన్నారు. కేంద్ర సాహిత్య అవార్డు పొందిన మన కేతు విశ్వనాథరెడ్డి మరణం ఇటు సాహితీ లోకానికి కమ్యూనిస్టు పార్టీకి తీరంలోటని వారి మతికి సంతాపాన్ని కుటుంబానికి సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి చంద్ర, నగర కార్యదర్శి వెంకటశివ, వేణుగోపాల్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'కేతు'కు సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు నివాళి

భారతీయ సాహిత్యంలో తెలుగు కథను ఉన్నత శిఖరానికి చేర్చిన కథకుడు కేతు విశ్వనాథరెడ్డి అని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ అన్నారు. కేతు విశ్వనాథరెడ్డి భౌతికకాయాన్ని దర్శించి పూలమావేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ సాహితీ స్రవంతికి ప్రారంభం నుంచి తోడ్పాటునందించారని పేర్కొన్నారు. సాహిత్య ప్రస్థానం మాసపత్రికలో అనేక కథలు, వ్యాసాలు అందించారని చెప్పారు. కథా సాహిత్యంలో ఆయన చిరస్మరణీయమైన కృషి చేశారని తెలిపారు. పరిశోధనుడుగా, పాఠ్యపుస్తక రచయితగా తెలుగుభాష సాహిత్యాలున్నంత వరకు ఆయనను తెలుగుజాతి మరచిపోదన్నారు. ఆయన మరణం పట్ల సంతాపాన్ని, ఆయన కుటుంబానికి సానుభూతిని ప్రకటిస్తున్నామని చెప్పారు. సాహితీ స్రవంతి జిల్లా కన్వీనర్ ప్రసాద్ పాల్గొన్నారు.

కేతు విశ్వనాథరెడ్డి మరణం బాధాకరం

కడప: కేతు విశ్వనాథ్‌రెడ్డి మరణష్టం బాధాకరమని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జా తిరుమలేష్ అన్నారు. కేతుకు ఆయన నివాళులర్పించారు. ఆయన మరణం సాహితీ లోకానికి తీరని లోటన్నారు. రాయలసీమ ఓ గొప్ప సాహితీవేత్తను కోల్పోయిందన్నారు.

గర్భిణులకు పోషకాహారం అందించాలి : గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు తప్పనిసరిగా సంపూర్ణ పోషకాహారం అందించాలని కలెక్టర్ గిరీష అంగన్వాడీలు, సిడిపిఒలు, సూపర్‌వైజర్లు, వర్కర్లు, ఆయాలను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని విసి హాలు నుంచి అంగన్వాడీ కేంద్రాల ద్వారా అమలు చేస్తున్న పథకాల అమలు, వాటి ప్రగతి తదితరాలపై అంగన్వాడీ కేంద్రాల సిబ్బందితో విసి ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అంగన్వాడీల కేంద్రాల బలోపేతానికి సిబ్బంది అందరూ చిత్తశుద్ధితో బాధ్యతాయుతంగా కృషి చేయాలన్నారు. 400 నుంచి 500 మంది జనాభా ఉన్న హాబిటేషన్లో అంగన్వాడీ కేంద్రాలు లేకుంటే వెంటనే వివరాలు పంపించాలన్నారు. మూడు ఫార్మాట్లను నిర్దేశించామని కొత్త అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాల్సిన ప్రదేశం, గతంలో ఉండి ప్రస్తుతం మూసివేసిన అంగన్వాడీ కేంద్రం, ఒక క్లస్టర్ నుంచి లేదా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మార్పు చేసిన అంగన్వాడీ కేంద్రం వివరాలను మండల వారీగా, సెక్టార్ వారీగా సదరు ఫార్మేట్లలో సోమవారం లోపు జిల్లా కేంద్రానికి పంపాలన్నారు. సదరు వివరాలను సమర్పించడంలో సిడిపిఓలు బాధ్యత తీసుకోవాలని సూచించారు. సంపూర్ణ పోషణలో భాగంగా గుడ్లు, పాలను సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. తీవ్ర రక్తహీనత కలిగిన వారికి అంగన్వాడీ కేంద్రాలలో అందజేసే ఐరన్ పోలిక్ యాసిడ్ మాత్రలను లబ్ధిదారులు తీసుకెళ్లినా కూడా సరిగా వాడడం లేదని దృష్టికి వచ్చింది. కాబట్టి తీవ్ర రక్తహీనత ఉన్నవారు అంగన్వాడీ కేంద్రంలోనే సదరు ట్యాబ్లెట్ వేసుకునేలా చూడాలి లేదా వారి ఇంటికి వెళ్లి ప్రతిరోజు మాత్ర వేసుకుంటున్నారో లేదో స్వయంగా విచారణ చేయాలని వర్కర్లు, ఆయాలను ఆదేశించారు. బరువు తక్కువ ఉన్న పిల్లల రిపోర్టు 80 శాతం మాత్రమే నమోదు జరిగిందని వంద శాతం నమోదు జరిగేలా దృష్టి పెట్టాలన్నారు. బరువు తక్కువ ఉన్న పిల్లలు, స్టెంటెడ్ పిల్లలకు కూడా అంగన్వాడీ కేంద్రాలలో ఆహారం తినేలా చూడాలని మొత్తం క్లస్టర్ పరిధిలో బరువు తక్కువ ఉన్న పిల్లలందరికీ సరైన పోషకాహారం తీసుకునేలా వర్కర్లు కృషి చేయాలన్నారు. పిల్లలకు వందశాతం ఆధార్ సీడింగ్ చేయించాలని, ప్రతి సచివాలయానికి నెలకు రెండుసార్లు డాక్టర్లు సందర్శించడం జరుగుతుందని ఆ సమయంలో ఆరోగ్యం సరిగా లేని వారు, స్టెంటెడ్ పిల్లలను డాక్టర్లకు చూపించేలా కృషి చేయాలన్నారు. వైయస్సార్ కిట్ల సరఫరా, టిఫికేషన్ ను త్వరగా పూర్తి చేయాలన్నారు. సంపూర్ణ పోషణ, పోషణ ట్రాకర్ ఆప్‌లలో కూడా ఎప్పటికప్పుడు వివరాలను అప్డేట్ చేయాలని చెప్పారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. బాలామృతం, పాలసరఫరా, అంగన్వాడీ స్కూల్ కన్స్ట్రక్షన్స్ అంశాలపై సమీక్షించారు. నాడు నేడు ద్వారా చేపట్టిన నూతన అంగన్వాడి పాఠశాలల నిర్మాణంలో వారం వారం ప్రగతి కనిపించాలన్నారు. అనంతరం సిడిపిఒలు, సూపర్వైజర్ల పర్యటనలపై కూడా సమీక్షించి తగు సూచనలు జారీ చేశారు. సమావేశంలో ఐసిడిఎస్ ఇన్‌ఛార్జి పీడీ ధనలక్ష్మి, సిడిపిఒలు, సూపర్వైజర్లు, వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

హరీష్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్

వైసిపి గెలుపు కోసం సమిష్టిగా కృషి చేద్దాం

- ఎపిఎండిసి డైరెక్టర్ హరీష్‌రెడ్డి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

రాబోయే ఎన్నికల్లో వైసిపి గెలుపు కోసం సమిష్టిగా కృషి చేద్దామని ఎపిఎండిసి డైరెక్టర్ హరీష్ రెడ్డి అన్నారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ బుధవారం ఆయనను కలిసి రాష్ట్ర స్థాయి కార్పొరేషన్ డైరెక్టర్‌గా తన నియామకానికి సహకరించినందుకు హరీష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గం, పీలేరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో రాబోయే ఎన్నికల్లో వైసిపిని అత్యధిక విజయం కోసం పార్టీ శ్రేణులను సంసిద్ధం చేసి, మళ్లీ వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు అంకిత భావంతో పనిచేయాల్సిన అవసరం మనందరిపై ఉందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతిపక్ష టిడిపి అడ్డుకుంటున్న దుర్మార్గపు చర్యలను ప్రజలకు వివరించాలని సూచించారు. రెండేళ్లపాటు కరోనా మహమ్మారి పరిపాలనను ప్రభావితం చేసినప్పటికీ రాష్ట్రంలోని పేద ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా సంక్షేమ పథకాలను యధాతథంగా అమలు చేసిన ఘనత సిఎంకే దక్కిందని పేర్కొన్నారు. దేశం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం వివిధ రంగాల్లో పురోగతిని సాధించి జాతీయస్థాయిలో అగ్రస్థానాల్లో ఉందన్నారు. సమర్థవంతమైన పరిపాలన, ప్రజాప్రయోగ పథకాలతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ప్రజల్లో విశేష ఆదరణ లభిస్తోందని, పార్టీలు, కులమ తాలకతీతంగా ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్తోందన్నారు. ముఖ్యంగా పరిపాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు, మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యతను ఇచ్చి సామాజిక న్యాయాన్ని అమలు చేస్తున్న ఘనత కూడా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రతిపక్ష టిడిపి నేతలు చంద్రబాబు నాయుడు, లోకేష్‌లను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు సైపుల్లా, రహంతుల్లా, ఉమ్మర్ సాహెబ్, ఖాదర్ బాషా, జవహర్ బాషా, జాకీర్, బాబు, సమీ, అలీ అన్సర్, జబీఉల్లా, ఫయాజ్, మౌలానా, సాదిక్ పాల్గొన్నారు.

98 డిఎస్‌సి అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వాలి

కడప అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా 1998 డిఎస్‌సి క్వాలిఫైడ్ అభ్యర్థులందరికి ఉపాధ్యాయ పోస్టులు ఇవ్వాలని పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు చంద్రమౌళి, సహాయ కార్యదర్శి అంకన్న కోరారు. బుధవారం ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎం.వి.రామచంద్రారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరికి ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం కొందరికే ఇవ్వడం దారుణమని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ఎంఎల్‌సి సిఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళతామని హామీ ఇచ్చారు.

జర్నలిస్టులకు ఇంటి పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఒంటిమిట్ట జర్నలిస్టులకు ఇంటి పట్టాలను బుధవారం రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి పంపిణీ చేశారు. ఒంటిమిట్ట రెవెన్యూ గ్రామం సర్వేనెంబర్ 2049లో 28 మంది జర్నలిస్టులకు 1.5 సెంట్లు చొప్పున అనుబంధ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మేడా మాట్లాడుతూ జర్నలిస్టు కాలనీకి అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిపి గడ్డం జనార్దన్‌రెడ్డి, గిడ్డంగుల శాఖ డైరెక్టర్ అకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, వైసిపి నాయకులు వెంకట్‌రెడ్డి, బొడ్డే వెంకటరమణ, మాధవరం సర్పంచ్ పన్నెల చంద్ర శేషారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, అధికారులు, సిఐ పురుషోత్తం రాజు, ఒంటిమిట్ట పోలీసులు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు

ఎపి ప్రాసిక్యూషన్స్ డైరెక్టర్‌గా సుదర్శన్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రాసిక్యూషన్స్ డైరెక్టర్‌గా సీనియర్ న్యాయవాది, కడప జిల్లా గాలివీడుకు చెందిన జల్లా సుదర్శన్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. బుధ వారం విజయవాడలోని డిఒపి కార్యాల యంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఆయన స్వగ్రామం గాలివీడు మండలం. గత 25 సంవత్సరాలుగా కడప జిల్లా కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు. ఈయన సివిల్, క్రిమినల్ కేసులు వాదించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. రాష్ట్ర హైకోర్టు ఆమోదంతో రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. రాష్ట్రంలోని అన్ని కోర్టులఃలోని పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, అసిస్టెంట్ ప్రాసిక్యూటర్స్, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, వారి సిబ్బంది సురేష్‌రెడ్డి పరిధిలోకి వస్తారు. రాష్ట్ర ప్రాసిక్యూషన్స్ డైరెక్టర్‌గా జల్లా సురేష్‌రెడ్డి నియామకం పట్ల కడప, అన్నమయ్య ఉమ్మడి జిల్లాలోని, రాష్ట్రంలోని న్యాయవాదులు అందరూ హర్షం వ్యక్తం చేశారు. ఈయన నియామకం కడప, అన్నమయ్య రెండు జిల్లాలకు గర్వకారణంగా ఉందని న్యాయవాదులు కొనియాడారు. సుదర్శన్‌రెడ్డికి అభినందన శుభాకాంక్షలు తెలియజేశారు.

తెలుగు సొసైటీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కడప: ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెన్ట్ తెలుగు సొసైటీ సేవలను ప్రవాసీలు సద్వినియోగం చేసుకోవాలని ఎపిఎన్ఆర్‌టిఎస్ డైరెక్టర్ బి.హెచ్.ఇలియాస్ అన్నారు. బుధవారం కువైట్‌లోని సాల్మియా ప్రాంతంలో కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మార్గదర్శకత్వంలో ఎపిఎన్ఆర్‌టిఎస్ చైర్మన్ మేడపాటి వెంకట్ నేతృత్వంలో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారి సమస్యలను పరిష్కరించడంలో ముందుంటుందని తెలిపారు. కువైట్ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి మాట్లాడుతూ కరోనా విపత్కర పరిస్థితులలో ప్రజలను అన్ని విధాల ఆదుకన్నామన్నారు. కార్యక్రమంలో వైసిపి కువైట్ కో-కన్వీనర్లు గోవిందు నాగరాజు, నరసారెడ్డి, సొసైటీ సభ్యులు న్యామతుల్లా, లక్కీ, ఆజీస్, షామిర్, ఖాదర్, అక్బర్, యూసుఫ్, మహమ్మద్ సలీమ్, ఇంతియాజ్, జాహిద్ పాల్గొన్నారు.

ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

సబ్ కలెక్టర్ అహ్మద్‌ఖాన్ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మా అహ్మద్‌ఖాన్ సేవలు మరువలేనివని రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ అధికారిని శిరీష, డివిజన్ పరిధిలోని తహశీల్దారులు తెలిపారు. సబ్ కలెక్టర్ అహ్మద్ ఖాన్ జనవరి 17వ తేదీన రాజంపేట సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టి నాలుగు నెలలుగా ఇక్కడ పనిచేశారని వివరించారు. ఈ నాలుగు నెలల కాలంలో డివిజన్లోని ఏ సిబ్బందిని కూడా ఇబ్బంది పెట్టకుండా నిబంధనల ప్రకారం పని చేయించుకున్నారని తెలిపారు. అదేవిధంగా ఎప్పటికప్పుడు అర్జీలను, ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించారని కొనియాడారు. తక్కువ కాలంలోనే సబ్ కలెక్టర్‌కు సంయుక్త కలెక్టర్‌గా ప్రమోషన్ రావడం అభినందించదగ్గ విషయమని తెలిపారు. చివరగా ప్రమోషన్‌పై సంయుక్త కలెక్టర్‌గా వెళుతున్న ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ను సబ్ కలెక్టర్ కార్యాలయం అడ్మినిస్ట్రేషన్ అధికారిని శిరీష ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది, డివిజన్లోని అన్ని మండలాలకు చెందిన తహసిల్దారులు శాలువాలు, పూలమాలతో సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఇన్చార్జి ఆర్డీవో గా నియమితులైన కె.భాస్కర్, డివిజన్లోని అన్ని మండలాల తహశీల్దారులు, సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మూలపల్లెలో తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-రాయచోటి

మండలం మాధవరం గ్రామం మూలపల్లిలో రెండు వారాల నుండి ప్రజలు తాగునీరు లేక చాలా ఇబ్బందులు పడుతున్న అధికారులు పట్టించుకోకపోవడంతో విషయం తెలుసుకున్న నియోజకవర్గ తెలుగుదేశం నాయకులు సుగవాసి ప్రసాద్‌బాబు బుధవారం పరిష్కరించారు. మూలపల్లి నివాసులు ఫోన్లో సమస్యపై ఆరా తీసి, సమస్యను పరిష్కరిద్దాం ఎంత ఖర్చైనా పరవాలేదు అంటూ హామీ ఇచ్చారు. ప్రసాద్ బాబు సహకారంతో మంచినీటి సమస్యపై స్పందించి మోటార్ రిపేర్లు చేయించి తాగు నీరు అందించినందుకు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో కేసినేని చంద్రశేఖర్ నాయుడు, కాసినేని జగన్నాథ్ నాయుడు, కాసినేని ఉమేష్ చంద్ర నాయుడు, కాసినేని మహేంద్ర నాయుడు, బాలినేని రెడ్డప్ప నాయుడు పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-రాయచోటి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదురుగా గురువారం నిర్వహించే రిలే నిరాహారదీక్షను జయప్రదం చేయాలని తాలూకా అధ్యక్షులు సాయి కుమార్, కార్యదర్శి సుజిత్, ఉపాధ్యక్షులు పల్లం రాజా, శ్రీనివాస్ నాయక్, సంయుక్త కార్యదర్శి హరి ప్రసాద్ పుష్పరాజు బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. రాయచోటి తాలూకాలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, కంటింజెంట్ ఉద్యోగులు అందరు పెద్దఎత్తున హాజరై రిలే నిరాహార దీక్షను జయప్రదం చేసి మన ప్రధాన డిమాండ్ల సాధనకై తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమానికి జిల్లా కార్యవర్గంతో పాటుగా రాష్ట్ర కార్యదర్శి ఎన్.లక్ష్మీపతి హాజరైతారని పేర్కొన్నారు.

మాట్లాడుతున్న చైర్మన్ పోలామ శ్రీనివాసరెడ్డి

మున్సిపాలిటీకి రూ.30.12 కోట్ల నిధులు

- చైర్మన్ పోలా శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యంతో వెలగపూడి సచివాలయంలో జరిగిన అమృత్ 2.0 హైపవర్ స్టీరింగ్ స్టేట్ కమిటీ సమావేశంలో రెండవ, మూడో విడత కింద ఆమోదం తెలిపిన నిధులలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి రూ.5952.52 కోట్ల నిధులు కేటాయించారని రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఈ నిధుల నుండి రాజంపేట మున్సిపాలిటీకి రూ.30.12 కోట్ల నిధులను మంజూరు చేశారని పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నిధులతో రాజంపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి తాగునీటి సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని చెప్పారు. ముఖ్యంగా మున్సిపాలిటీ పరిధిలో పాత పైప్ లైన్ తొలగించి కొత్త పైపు లైన్లు ఏర్పాటుచేసి తద్వారా పట్టణ ప్రజలకు నీటిని సరఫరా చేస్తామని చెప్పారు. ఇంకా నిధులు మిగిలితే డ్రైనేజీ పచ్చదనం పనులకు వినియోగిస్తామని వివరించారు. రాజంపేట మున్సిపాలిటీకి నిధులు మంజూరు చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి, నిధులు మంజూరుకు కృషి చేసిన రాజంపేట ఎంపీ మిధున్ రెడ్డికి, ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జునరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు డొంక సురేష్, న్యామతుల్లా, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆంగ్ల మధ్యంలో ఉన్న వివిధ తరగతులలో ఖాళీగా సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.నాగరత్నమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడవ తరగతిలో 37 సీట్లు, నాలుగవ తరగతిలో 24 సీట్లు, ఐదవ తరగతిలో 17 సీట్లు, ఆరవ తరగతిలో 18 సీట్లు, ఎనిమిదవ తరగతిలో ఆరు సీట్లు, తొమ్మిదవ తరగతికి 7 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. పూర్తి వివరాలకు 98850 88024 ఫోన్ నెంబర్ ను సంప్రదించాలన్నారు. ఆంగ్ల మాధ్యమంలో అనుభవం కలిగిన ఉపాధ్యాయుల చేత విద్యాబోధన అందిస్తామన్నారు.

స్వయం ఉపాధిపై ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - కడప

కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్‌లో 30 రోజులపాటు, బ్యూటీ పార్లర్ మేనేజ్మెంట్ కోర్స్‌లో 30 రోజులపాటు ఉచితంగా ఇస్తున్న శిక్షణను గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ డైరెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. 18-45 సంవత్సరాలలోపు వయసు గల నిరుద్యోగ మహిళలు ఉచిత శిక్షణ పొందేందుకు అర్హులని తెలిపారు.

రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ ఎం.వి.కిషోర్ కుమార్‌రెడ్డి

ఆరోగ్యం పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి- కలకడ

ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయకూడదని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎం.వి కిషోర్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎర్రకోటపల్లి పిహెచ్‌సి పరిధిలోని దేవులపల్లి పంచాయతీ బొజ్జుగుంటపల్లి గ్రామంలో వైద్యాధికారి ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ గర్భిణులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. కష్టతరమైన గర్భిణులను గుర్తించి ఉన్నత స్థాయి వైద్యశాలలకు రెఫర్ చేసినట్లు తెలిపారు. పది గ్రాములు రక్తం తక్కువ ఉన్న వారిని గుర్తించి వారికి ఐరన్, సుక్రోజ్‌లు, ఐరన్ మాత్రలు, డబల్ డోసు ఇవ్వాలని తెలిపారు. 50 సంవత్సరాలు పైబడిన వారందరినీ ఫ్యామిలీ పిజిషన్ కార్యక్రమానికి పిలవాలని షుగర్, బిపి పరీక్షలు నిర్వహించి ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ జి.జయరామయ్య ఎంపిహెచ్ఎస్ షేక్ .ముజీబ్‌బాషా, ఎంఎల్‌హెచ్‌పి అబ్బురిరాజా, సులో చన, డేటా ఎంట్రీ ఏ.రోజా పైలట్ ఏ.రమేష్‌బాబు, ఆశకార్యకర్తలు ఎస్‌వి.రమణమ్మ, ఆశ కార్యకర్త డి.రెడ్డమ్మ పాల్గొన్నారు.

విద్యాశాఖ కృషితోనే అంగన్వాడీ స్థలాలు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల విద్యాశాఖ అధికారుల కృషితోనే అంగన్వాడీ భవనాలకు స్థలాలు మంజూరయ్యాయని స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీలో సచివాలయం-2లో వెంగంరాజుగారిపల్లె అంగన్వాడీ కేంద్రానికి కేటాయించిన స్థలం ప్రభుత్వ స్థలమని తాహశీల్దార్ మహబూబ్ చాంద్ స్వయంగా ఆ స్థలంలో ఉన్న పెద్ద పెద్ద చింతచెట్లను జెసిబి సహాయంతో తొలగించినట్లు తెలిపారు. ఎంఇఒ వెంకటేష్ నాయక్ కృషితోనే అంగన్వాడీ భవన నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని అన్నారు. పునాదులు అయిపోయి మోలింగ్ వరకు పిల్లర్లు వేసినట్లు తెలిపారు. రాయవరంలో కూడా కలెక్టర్, డిఇఒ ఆదేశాల మేరకు డిఇఒ, తహశీల్దార్‌లు అంగన్వాడీ భవన నిర్మాణాలను వేగవంతం చేయడం సంతోషకరమని అన్నారు.

సొంత నిధులతో రోడ్లకు మరమ్మతులు

ప్రజాశక్తి-సుండుపల్లె

పి.రహిమాన్‌ఖాన్

మండలంలోని గత తుఫాను ప్రభావంతో కొట్టుక పోయిన రోడ్లకు తన సొంత నిధులతో మరమ్మతులు చేయించినట్లు వైసిపి యువకునాయకుడు పి.రహిమాన్‌ఖాన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో శారద స్కూల్ వీధులు, జనార్ధన్‌రెడ్డి కాలనీ, ఎంపిడిఒ కార్యాలయం వీధి, బైరాగుట్ట సమీపంలోని పెట్రోలు బంకు ప్రధాన రోడ్డులో దెబ్బతిన్న రోడ్లకు మట్టి తోలి మరమ్మతులు చేయించినట్లు తెలిపారు. వైసిపి బలోపేతానికి తన వంతుగా కృషి చేస్తూ ప్రజల సమస్యలను తనకు తోచిన మేర సహాయం చేస్తున్నానని చెప్పారు. అధికారులు మాత్రం నిధులు వస్తే మంజూరు చేస్తామని చెప్పి చేతులు దులుపకుంటున్నారనే ఇంతవరకు ఒక్క రూపాయి బిల్లు చేసిన పాపాలు పోలేదని తెలిపారు. కువైట్‌లో ఇబ్బందులు పడుతున్న ఈ ప్రాంత వాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేసినట్లు తెలిపారు. ఇబ్బందుల్లో ఉన్న వారికి ఇక్కడికి తీసుకొచ్చేందుకు ఏర్పాటు ఎంతగానో సహకరించినట్లు పేర్కొన్నారు. కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల వారి సమస్యల పరిష్కా రానికి తనవంతు సహకారం ఎల్లవేళల ఉంటుందని అన్నారు. మండలంలోని వైసిపి మరింత బలోపేతానికి తన శాయశక్తుల కృషి చేస్తానని తెలిపారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పార్టీని విడిచిపెట్టే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.

విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

విద్యుత్ కోతలపై టిడిపి నిరసన

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

వేసవికాలంలో విద్యుత్ కోతలు, పెంచిన విద్యుత్ చార్జీలపై మండల టిడిపి నాయకులు, రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధి ఆర్‌జె.వెంకటేష్, టిడిపి మండల అధ్యక్షులు పుర్రా వెంకటరమణ ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్తు సబ్ స్టేషన్ ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ ద్వారా యూనిట్ ధర ను కేవలం రూ.6కే 25 సంవత్సరాల కాలానికి అదే రేటుతో సరఫరా చేసే విధంగా అగ్రిమెంట్ చేసి నిరంతరాయంగా ప్రజలకు విద్యుత్తును అందించారని అన్నారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ అగ్రిమెంట్ ను రద్దు చేశారని అన్నారు. కానీ నేడు అదే యూనిట్ కరెంటును రూ.26లకు కొనుగోలు చేస్తూ ఆ భారాన్ని ట్రూ అప్ చార్జీల రూపంలో ప్రజల నెత్తిన బాదుతున్నారని తెలిపారు. విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తానని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎనిమిది సార్లు విద్యుత్ చార్జీలను పెంచారని పేర్కొన్నారు. ప్రస్తుతం వేసవికాలంలో కూడా ఎప్పుడంటే అప్పుడు కరెంటు కోతలను విధిస్తున్నారని అన్నారు. రైతుల వ్యవసాయ బోర్లకు విద్యుత్ మీటర్లను అమర్చడానికి అధికార యంత్రాంగం సిద్ధమవుతోందని, ఇటువంటి చర్యలను ప్రభుత్వం మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు రెడ్డప్పరెడ్డి, ముని రత్నం, మల్లికార్జున, మల్లప్ప, మురళీమోహన్, లక్ష్మన్న, విజయ్, చంద్ర పాల్గొన్నారు.

పంచాయతీ వనరులు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-రామాపురం

సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిపిఒ

పంచాయతీలలో ఎస్‌డబ్ల్యూ పిసి కేంద్రాలలో కంపోస్ట్ ఎరువులను తయారుచేసి తద్వారా వచ్చే నిధులను గ్రామాభివృద్ధికి విని యోగించుకోవాలని డిపిఒ ధనలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని చిట్లూరు పంచాయతీలోని ఎస్‌డబ్ల్యూపిసి కేంద్రాన్ని ఆమె బుధవారం తనిఖీ చేశారు. అనంతరం సచివాలయంలో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి గర్భిణులకు పౌష్టికారాన్ని అందించారు. సంపద తయారీ కేంద్రాల ద్వారా ఆదాయాన్ని పెంచుకునే మార్గాల గురించి సిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో డిపిఒ వెంట ఇఒపిఆర్‌డి ఉషారాణి, సర్పంచ్ రామానుజులు, ఐసిడిఎస్ సూపర్వైజర్‌లు పద్మజ, అరుణమ్మ, పంచాయతీ కార్యదర్శి మద్దిలేటి, సచివాలయ సిబ్బంది గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

శ్రీ అనంతపద్మనాభస్వామి దేవాలయము
దిన్నెపాడు (గ్రా), లక్కిరెడ్డిపల్లె (మం), అన్నమయ్య జిల్లా.
e-Procurement Tender
NIT NO. COE/1295/2022-6 Dt:12-12-2022
దేవాలయమునందు ప్రాకారము నిర్మాణము కొరకు e-Procurement ద్వారా టెండర్లు కోరడమైనది. వివరములకు http://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు.
కార్యనిర్వహణాధికారి

ఈదురు గాలుల బీభత్సం

నేలరాలిన మామిడి..తీవ్రంగా నష్టపోయిన రైతులు

తీవ్ర గాలులకు నేలరాలిన మామిడికాయలు

రోడ్డుకు అడ్డంగా విరిగిపడ్డ చెట్లు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

తీవ్రమైన గాలుల, వడగళ్ల బీభత్సానికి మండలంలోని పలుచోట్ల మామిడికాయలు నేలరాలి , కోళ్ల ఫారం, పెద్ద వృక్షాలు విరిగి నేలనపడ్డాయి. బుధవారం సాయంత్రం సుమారు ఐదున్నర గంటల ప్రాంతంలో తీవ్రమైన గాలులతో, వడగళ్లతో కూడిన మోస్తారుగా వర్షం కురిసింది. తీవ్ర గాలుల, వడగళ్ల తాకిడికి అగ్రహారం పంచాయతీ రెడ్డివారిపల్లి రోడ్డు మార్గంలోని పలు చోట్ల చెట్లు రోడ్డుకు అడ్డంగా విరిగిపడ్డాయి. రెడ్డివారిపల్లికి చెందిన భగీరెడ్డి మామిడి తోటలోని మామిడికాయలు నేల రాలాయి. గాలుల తాకిడికి కోళ్ల ఫారం పైకప్పు దెబ్బతింది. అగ్రహారం నుంచి రెడ్డివారి పల్లి, బండమీద పల్లెకి వెళ్లే రోడ్డు మార్గంపై చెట్లు విరిగి పడ్డాయి. రాకపోకలు కొనసాగించడానికి ప్రజలకు ఇబ్బందిగా మారింది. ఉద్యానవన పంటలైన మామిడి, బొప్పాయి, టమోటా వంటి పంటలు గాలుల ప్రభావానికి దెబ్బతినడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా కోత దశలోని మామిడి అకాల గాలులకు నేల రాలుతున్నడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు, ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

అకాలవర్షంతో భారీ నష్టం : ఎంపిపి

పుల్లంపేట : మండల పరిధిలోని అనంతసముద్రం గ్రామపంచాయతీ పరిధిలోని పెద్దూరు, పుత్తనవారిపల్లి, సిద్దాలపల్లి, బోటుమీదపల్లి, పాపక్కగారిపల్లి, పుల్లారెడ్డిపల్లి తదితర గ్రామాలలో మూడు రోజుల నుంచి కురుస్తున్న అకాల వర్షం, ఈదురు గాలులతో దెబ్బతిన్న అరటి తోటలను మండల ఎంపిపి ముద్దా బాబుల్‌రెడ్డి బుధవారం పరిశీలించి నష్టపరిహారంపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొలకలు నాటి ఎరువులు వేసి లక్షలాది రూపాయలు ఖర్చు చేసి పైరు చేతికందే సమయంలో అకాల వర్షాలు, ఈదురు గాలులతో రైతులు సంవత్సరం పాటు పడ్డ కష్టం బూడిదలో కలిసిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి విపత్తుల రూపంలో రైతులు ఆత్మహత్యలకు గురవుతున్నారని తెలిపారు. నష్టపోయిన అరటి రైతులను అధికారులు పర్యటించి నష్టపరిహారం చెల్లించాలని, రైతులకు ప్రభుత్వం నుంచి వచ్చే నష్టపరిహారం ఇప్పిస్తానని రైతులకు ఎంపిపి సూచించారు. సుమారు రూ.45 కోట్ల మేర అరటి రైతులు నష్టపోయారని ప్రభుత్వం నుంచి వచ్చే నష్టపరిహారం తక్షణమే రైతులకు చెల్లించాలని సంబంధిత అధికారులకు తెలిపారు.

అరటితోటను పరిశీలిస్తున్న ఎంపిపి

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండలపరిధిలోని నాలుగవ వార్డు మసీదు వెనుక వీధిలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ఉండడంతో కొంతమంది స్థానికులు తాత్కా లికంగా కర్రలను ఊతంగా పెట్టారు. కర్రలు వానకు తడిసి చెదలు పట్టి కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నాయి. గాలివాన, ఈదురు గాలులకు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటివరకు వాటిని సరి చేయకపోవడంతో నివాసం ఉంటున్న ప్రజలు ఆ దారిలో పనులు చేసుకోవడానికి వెళ్లాంటే వణికిపోతున్నారు. ఆ ప్రాంతంలో పచ్చిక ఉండడంతో పశువులు మేత కోసం వెళ్లి విద్యుత్ షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్తు ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన విద్యుత్ తీగలను సరి చేసి కొత్త స్తంభాలను పాతి విద్యుత్ అమర్చాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయం పైన విద్యుత్ ఎఇ హరినాధ వివరణ కోరగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా అంచనాలు తయారు చేసి పంపించామని అనుమతులు రాగానే స్తంభాలు నాటి విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

29న తంబళ్లపల్లి మండల సమావేశం

తంబళ్లపల్లి : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఈనెల 29న మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపిడిఒ ఆనంద్ కుమార్ తెలిపారు. ఎంపిపి అనసూయమ్మ అధ్యక్షతన సోమవారం ఉదయం 10:30 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. ఎంపిటిసి సభ్యులు మండల కో-ఆప్షన్‌సభ్యులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఎలు, మండల, డివిజన్ స్థాయి అధికారులు అందరూ సమావేశానికి అందరూ తప్పక హాజరు కావాలని కోరారు. అధికారులు తమ తమ శాఖల ద్వారా చేపట్టిన ప్రగతి నివేదికలను సమావేశానికి మూడు రోజుల ముందు ఎంపిడిఒ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

నూతన పరిశోధనలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-కురబలకోట

స్థానిక మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం వారు అయిదు రోజుల పాటు జాతీయ స్థాయిలో ట్రెండ్స్ అండ్ ఆపేర్చునిటీస్ ఇన్ డిఫెన్సె సెక్టార్‌పై డిఫెన్స్‌రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సమ్మిట్‌ను ఏర్పాటు చేశారు. దేశ నలుమూలల నుంచి విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు, డిఫెన్సె రంగంలో గల మేధావులు పాల్గొన్నారు. రక్షణ రంగంలో నూతన పరిశోధనలపై చర్చ, పరిశోధన రంగాన్ని అన్వేషించడానికి, సహకరించడానికి ఈ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. ముఖ్య అతిథిగా సైంటిస్ట్ డాక్టర్ షణ్ముగరాజు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నూతన పరిశోధనలపై దృష్టి సారించి, దేశానికి ఉపయోగపడే పరిశోధనలు చేయాలనీ అన్నారు. డిఫెన్స్ శాస్త్రవేత్త డాక్టర్ కె. రవిచంద్రన్ మాట్లాడుతూ డిఫెన్సె రంగంలో రూ.70వేల కోట్లు విలువ చేసే 390 ప్రాజెక్టులు డిఆర్‌డిఒలో ఉన్నాయని ఇతర దేశాలకు డిఫెన్స్‌కు సంబంధించిన ఆయుధాలను మనమే సరఫరా చేయవచ్చుని అన్నారు. కార్యక్రమంలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ లక్ష్మణరావు, సిఎఫ్ఒ డాక్టర్ ఈశ్వర్, అకాడమిక్ అడ్వైజర్ కృష్ణరావు, అసోసియేట్ డీన్ డాక్టర్ తులసీరామ్ నాయుడు, కన్వీనర్ డాక్టర్ ఐ.అరుణ్ పాల్గొన్నారు.

సిహెచ్‌ఒలకు ఉద్యోగోన్నతులు ఇవ్వాలి

నందలూరు : సిహెచ్‌ఒలకు పదోన్నతులు ఇవ్వాలని అడిషనల్ డైరెక్టర్ అఫ్ మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్ డాక్టర్ కెవిఎన్‌ఎస్ అనిల్ కుమార్ ను కోరినట్లు రాష్ట్ర సిహెచ్‌ఒల సంఘ గౌరవ అధ్యక్షులు పిల్లి పిచ్చయ్య తెలిపారు. సోమవారం అనిల్‌కుమార్‌కు రీజినల్ డైరెక్టర్ అఫ్ హెల్త్ కడప రీజియన్ జోన్-4 అదనపు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మర్యాదపూర్వకంగా రాజంపేట డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ చెన్నకృష్ణ, రైల్వేకోడూరు నోడల్ ఆఫీసర్ డాక్టర్ శేఖర్, రాష్ట్ర సిహెచ్‌ఓస్ గౌరవ అధ్యక్షులు, రాజంపేట పెన్షనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పిల్లి పిచ్చయ్య, సిదరామయ్య, టిబి సూపర్వైజర్ జయప్రకాశ్ కలసి అభినందనలు తెలిపారు.

హోంగార్డుకు ఆర్థిక సాయం

కురబలకోట : రోడ్డు ప్రమాదంలో గాయపడిన హోంగార్డుకు ఎస్‌పి ఆర్.గంగాధరరావు రూ.30వేలు ఆర్థిక సాయం అందించారు. మదనపల్లి హోంగార్డు యూనిట్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఆర్.మధుకర్‌రెడ్డి ముదివేడు పోలీస్‌స్టేషన్‌లో విధుల నిమిత్తం కురబలకోటకు వెళ్లి వస్తుండగా ట్రాక్టర్ ఢీకొని కుడికాలు పాదం విరిగింది. ఈ ప్రమాద సంఘటనను తెలుసుకున్న ఎస్‌పి స్పందించి జిల్లా పోలీస్ ప్రదాన కార్యాలయంలో హోంగార్డుకు రూ.30వేల చెక్కును అందించారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి పి.మహబూబ్‌బాషా ఆర్‌ఐ, యస్.జావిద్, మదనపల్లి సబ్ డివిజన్ హోంగార్డు ఇన్‌ఛార్జి యం.రెడ్డినాయక్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

వీరబల్లి : మండలంలో 17 రోజుల నుంచి వేసవి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరిగింది. ఈ టోర్నమెంట్ రాజంపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బత్యాల చెంగల్‌రాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో సాఫ్ట్‌వేర్ స్ట్రైకర్స్ గ్రంధేవాండ్లపల్లి, ఈడిగపల్లి జట్ల మధ్య హోరాహోరిగా జరిగింది. ఈ ఫైనల్ మ్యాచ్ లో ఈడిగపల్లి జట్టు పై గ్రందేవాండ్లపల్లి జట్టు గెలుపొందడం జరిగింది. గెలుపొందిన జట్టుకు మెదటి బహుమతి రూ.50వేలు రన్నర్స్‌కు రూ.30వేలు ప్రదానం చేశారు. టిడిపి నాయకులు పోతురాజు నవీన్, హేమరాజ్, కొల్లి రవి నాయుడు, గుట్టబాబు, చేతుల మీదుగా అందించారు. ఈ టోర్నమెంట్ నిర్వహించడానికి కృషి చేసిన నిర్వాహకులైన టిడిపి మండల ప్రధాన కార్యదర్శి రాయ వెంకటేసు, యువనాయకుడు వెంకటరమణ, కొల్లిఅంజి, కొల్లిబాబు, కొల్లిశ్రీనాథ్, బాలకృష్ణ, అబ్బురి మల్లికార్జునలను అభినందించారు. కార్యక్రమంలో విఆర్‌డిఎస్ చైర్మన్ సురేంద్రారెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

తాగునీటి మోటార్ వితరణ

సుండుపల్లి: మండలంలోని శ్రీకర్‌పాలెంలో గ్రామస్తుల అభ్యర్థన మేరకు రూ.60వేలు విలువ గల తాగునీటి మోటర్‌ను రాజంపేట జనసేన పార్టీ నాయకులు అతికారి దినేష్ చేతుల మీదుగా అందించారు. రాజంపేట వీరమహిళ రెడ్డిరాణికి శ్రీకర్‌పాలెం గ్రామస్తులు మాకు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని ఆమె దృష్టికి తీసుకవచ్చారు. తాగునీటి మోటర్‌ను ఏర్పాటు చేస్తే గ్రామస్తుల దాహార్తిని తీర్చిన వారవుతారని కోరారు. ఆమె గ్రామస్తుల సమస్యను అతికారి దినేష్ దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే స్పందించిన దినేష్ రూ.30వేలు తాగునీటి మోటర్‌కు ఆర్థిక సహాయం అందించారు. రూ.30 వేల రూపాయలు దాతల సహాయంతో సమకూర్చి రూ.60 వేలతో తాగునీటి మోటారు ఏర్పాటు చేశారు.

కూలీలకు ఉపాధి పనులే జీవనాధారం

ప్రజాశక్తి-వీరబల్లి

ఉపాధిహామీ పథకం పనుల కూలీలకు జీవనాధారంగా మారాయని ఎంపిపి గాలివీటి రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎంపిడిఒ మల్లీశ్వరి అన్నారు. బుధవారం ఉపాధి హామీ పనులపై గుర్రప్పగారిపల్లి పంచాయతీలో సర్పంచ్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి హామీ పనులతో పేద ప్రజలు రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే కాకుండా జీవనోపాధి పొందుతున్నారన్నారు. ముఖ్యంగా రైతులకు ఉపయోగపడే పనులను గుర్తించి పనులను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది, వైసిపినాయకులు సుబ్బరామరాజు, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

గంగమ్మ జాతరకు హాజరైన మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండల పరిధిలోని వేంపల్లి పంచాయతీలో గంగమ్మ జాతర బుధవారం అత్యంత వైభవంగా జరిగింది.వేంపల్లెకు చెందిన బైగారి కిషోర్ నాయుడు, కన్నెమడుగు సోమశేఖర్, బైగారి మధు, బైగారి వెంకటరమణల ఆహ్వానం మేరకు మాజీ ఎమ్మెల్యే, టిడిపి నాయకులు షాజహాన్‌బాషా ఈ జాతరకు హాజరయ్యారు. ఇందులో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి,తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో నాదేళ్ల శివ, భూమిసీడ్స్ రమణ, షంషేర్, నాగుర్ వల్లి, రఘుపతి, వేమయ్య, చీకలబైలు సర్పంచ్ ప్రభాకర్, సంగం హరి, వరుణ్, మల్లి, జభి, పూలకుంట్ల హరి బాబు, రాజేష్, బాలు, లాల్‌బాషా, రెడ్డి, మహబూబ్ ఖాన్, బండిఅమర, రాజన్న, వెంకటరమణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్పంచ్ మృతికి ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి-ములకలచెరువు

పిటిఎం మండలంలోని రంగసముద్రం పంచాయతీ సర్పంచ్ జగదీశ్వర్‌రెడ్డి మంగళవారం విద్యుదాఘాతంతో మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. బుధవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకానాథ్‌రెడ్డి సర్పంచ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన వెంట రాజంపేట నియోజకవర్గ మైనార్టీ నాయకుడు రియాసత్ అలీఖాన్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రసవత్తరంగా క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ అరవపల్లె లోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నందలూరు ప్రీమియర్ లీగ్ ఏడవ సీజన్లో భాగంగా జరుగుతున్న హార్డ్ టెన్నిస్ బాల్ ఓపెన్ టు ఆల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు రసవత్తరంగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం ఈద్గా బాయ్స్ నాగిరెడ్డిపల్లి జట్టు మొదట బ్యాటింగ్ చేసి 14.5 ఓవర్లలో 99 పరుగులు సాధించడం జరిగింది. అనంతరం బరిలో దిగిన రాజంపేట వాసు లెవెన్ జట్టు 12 ఓవర్లలో 5 వికెట్లను కోల్పోయి విజయ లక్ష్యాన్ని చేరారు. ఐదు వికెట్లు తీసి 35 పరుగులు చేసిన వాసుకి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు ఇవ్వడం జరిగింది.మధ్యాహ్నం మొదట బ్యాటింగ్ చేసిన ఎర్రి పాపాయిగారిపల్లె జట్టు 15 ఓవర్లు ముగిసే సమయానికి ఏడు వికెట్లను కోల్పోయి 130 పరుగులు చేశారు. గోపి లెవెన్స్ వెంకటరాజంపేట జట్టు 11 ఓవర్లలో మూడు వికెట్లను కోల్పోయి 131 పరుగులు చేసి గెలుపొందారు. మధు 3 వికెట్లు తీసి 40 పరుగులు చేయడంతో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ఈ పోటీలలో అరవ పల్లె ప్లేగ్రౌండ్ యూత్, క్రీడాకారులు క్రీడా అభిమానులు పాల్గొన్నారు.

కూలీ రేట్లపై ఒప్పందం చేయాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆర్‌టిసి లైసెన్స్ పోర్టర్ల కూలీలకు సంబంధించిన కూలీ రేట్ల పెంపుదలపై తక్షణం ఒప్పందం చేయాలని, దాని ప్రకారం కూలి చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి యం.సాంబశివ డిమాండ్ చేశారు. ఆర్‌టిసి లైసెన్స్ పోర్టర్లకు కూలి రేట్ల ఒప్పందం చేయాలని కోరుతూ బుధవారం ఆర్‌టిసి బస్టాండ్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ ఆర్టీసీ కూలీలకు కూలి రేట్ల ఒప్పందం ముగిసి మూడు నెలలు గడుస్తున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం అన్యాయమని దుయ్యబట్టారు. పోర్టర్లకు చట్టప్రకారం పీఎఫ్, ఈఎస్ఐ, బీమా, యూనిఫామ్, ఐడీ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పోర్టర్లు రమణనాయుడు, గంగులు, దామోదర, బాబుమోలాలి పాల్గొన్నారు.

భూ సర్వేను తనిఖీ చేసిన తహశీల్దార్

ప్రజాశక్తి-పుల్లంపేట

కలెక్టర్ గిరీష ఆదేశాల మేరకు బుధవారం మండల పరిధిలోని జాగువారిపల్లె గ్రామంలో నిర్వహిస్తున్న జడ్‌హెచ్‌డిసి భూముల సర్వేను తహశీల్దార్ నరసింహ కుమార్ పరిశీలించారు. రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు సర్వే ఏ విధంగా నిర్వహిస్తున్నారు దగ్గరుండి పరిశీలించి వారికి తగు సూచనలు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు లీజు పట్టాలు పొందిన భూమిపై అనుభవంలో ఉన్న దళితులకు ప్రభుత్వం ఎలాంటి సహాయ సహకారాలు చేపట్టదలుచుకుందో వారికి విపులంగా వివరించారు .కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, జాగువారి పల్లె గ్రామస్తులు పాల్గొన్నారు.

వరి,వేరుశనగ విత్తనాలను శుద్ధి చేస్తున్న కెవికె శాస్త్రవేత్తలు

విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ

ప్రజాశక్తి-కలికిరి

విత్తనశుద్ధితో పంట తెగుళ్లు, పురుగులను నివారించవచ్చునని కలికిరి కృషివిజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ జి.ఎస్ పాండురంగ తెలిపారు. విత్తనశుద్ధితో కలిగే లాభాలుపై రైతులకు బుధవారం అవగాహన కార్యకమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు వివిధ పంటల్ని విత్తేటప్పుడు విత్తన శుద్ధి విధిగా చేయాలని సూచించారు. విత్తన శుద్ధి చేసేటప్పుడు చేతులకు గ్లౌస్, ముఖానికి మాస్క్ తప్పనిసరిగా ధరించాలన్నారు. విత్తనం, నేల ద్వారా తెగుళ్లు సంక్రమించి మొక్కలు సాంద్రత తగ్గి దిగుబడులు తగ్గుతున్నాయని అన్నారు. దీని నివారణకు విత్తన శుద్ధి చేసుకున్న మొదటి ముప్పై రోజుల వరకు నేల ద్వారా, విత్తనం ద్వారా సంక్రమించే తెగుళ్ళను నివారించి సూచించిన మొక్కల సాంద్రత ఉండడం ద్వారా ఆశించిన దిగుబడులు వస్తాయని తెలిపారు. వరిలో కిలో విత్తనానికి 3 గ్రాములు కార్బెండజం 50 శాతం మందును కలిపి 24 గంటల తర్వాత నారుమడిలో చల్లుకోవాలని సూచించారు. విత్తిన శుద్ధి చేసుకోవడం ద్వారా నేల నుంచి సంక్రమించే తెగుళ్లను నివారించి మొక్కల సాంద్రత బాగా ఉండి సూచించిన దిగుబడి వస్తుందని, మొదలు కుళ్ళు, వేరు కుళ్ళు, కాండం కుళ్ళు తెగుళ్ల ఎక్కువగా ఆశించే ప్రాంతాల్లో కిలో విత్తనానికి 10 గ్రాముల ట్రైకోడెర్మా విరిడీని పట్టించాలని సూచించారు.

నందలూరు : వాలంటీర్లను సన్మానిస్తున్న ఎంపిపి మేడా విజయభాస్కర్‌రెడ్డి

వాలంటీర్లు ప్రభుత్వానికి సైనికులు

ప్రజాశక్తి-నందలూరు

వాలంటీర్లే ప్రభుత్వానికి సైనికులని ఎంపిపి మేడా విజయ భాస్కర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉత్తమ సేవలందించిన ఆడపూరు, పొత్తపి వాలంటీర్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో వాలంటీర్లు చేసిన సేవలు మరువలేని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు నియమితులైన వాలంటీర్లు చేసిన సేవలతో దేశవ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక గుర్తింపు లభించిందని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో వాలంటీర్లు పాత్ర ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సౌభాగ్యమ్మ, ఇఒపిఆర్‌డి ప్రసాదు, జిల్లా వక్ఫ్ బోర్డ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ అమీర్, కో-ఆప్షన్ సభ్యులు ఖలీం, మాజీ ఎంపిపి భువన బోయిన లక్ష్మీనరసయ్య, తుమ్మల శ్రీధర్ గౌడ్, కసిరెడ్డి రమేష్‌రెడ్డి, సచివాలయం అధికారులు పాల్గొన్నారు. **వీరబల్లి :** ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అమలు చేయడంలో వార్డు వాలంటీర్ల సేవలు ప్రశంసనీయమని ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి, ఎంపిడిఒ మల్లీశ్వరి, మట్లి సర్పంచ్ నాగార్జునచారిలు పేర్కొన్నారు. బుధవారం వాలంటీర్ల సన్మానం కార్యక్రమంలో భాగంగా గుర్రాప్పాగారిపల్లి, ఒదివీడు, మాట్లి పంచాయతీలలో పని చేస్తున్న వాలంటీర్లకు ప్రశంసా పత్రాలతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచులు నాగార్జునచారి, విజయలక్ష్మి, శంకరమ్మ, ఎంపిడిఒ మల్లేశ్వరి, వైసిపి నాయకులు ఈశ్వరయ్య, సుబ్బ రామరాజు, ఒడివీడు మహబూబ్‌బాషా, ఆన్సర్ బాషా పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

ప్రజాశక్తి-కలికిరి

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎపిటిఎఫ్ పనిచేస్తుందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతినేని కుమార్ యాదవ్ తెలిపారు. బుధవారం కలికిరిలో ఎపిటిఎఫ్ జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు అహ్మద్ ఇలియాజ్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా రాష్ట్ర అదనపు కార్యదర్శి చెంగ్రాయ మందడి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యచరణలపై అవగాహన, ఉపాధ్యాయుల సమస్యలను నిరంతరం గుర్తించటం, పరిష్కారానికి నాయకత్వాలు కృషి చేయడం, సంఘాన్ని మండలాలవారీగా విస్తరించే వ్యూహాలపై చర్చ ఉపాధ్యాయ బదలీలకు దరఖాస్తు చేయడం, బదలీల వ్యవహారంపై పలు సందేహాలు, సమాధానాలు మొదలగు అంశాలపై ఉపాధ్యాయులతో కూలంకష చర్చా కార్యక్రమం నిర్వహించబడినట్లు ఆయన తెలిపారు. ఇందులో ఉపాధ్యాయులు కోరిన పలు డిమాండ్, సందేహాలను నమోదుచేసుకుని రాష్ట్ర అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శిలకు తెలిపి, ప్రభుత్వంతో జరిగే చర్చలలో లేవనెత్తి స్పష్టత ఇవ్వాలని ప్రతిపాదించిన్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సహదేవ, రెడ్డమోహన్, శంకర్, మురళి, చంద్రయ్య, వేణుగోపాల్, ప్రతాప్, సంషుద్దీన్, జనార్దన్, సుబ్రహ్మణ్యం, మహ్మద్ రఫీ, రమణ మరియు విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వడ్డిపల్లిలో శ్రీ సీతారామ విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని పాటూరు పంచాయతీ వడ్డీపల్లిలో శ్రీ సీతారామ, లక్ష్మణ, హనుమ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం బుధవారం అత్యంత ఘనంగా జరిగింది. స్మార్త ఆగమ పండితులు బండాత్మకూరు శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం అభిషేకం, హోమం, స్తపనము, దీక్షాబంధనం, నైవేద్యం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం 11 గంటలకు శ్రీ సీతారాముల కళ్యాణం కన్నుల పండు గగా భక్తుల గోవింద నామస్మరణల నడుమ గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అందరం భక్తులకు పెద్ద ఎత్తున కళ్యాణ విందు భోజనాన్ని ఏర్పాటు చేశారు. ఈ విశేష పూజలలో భాగంగా పూర్ణాహుతి కార్యక్రమానికి జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్నాథరెడ్డి హాజరై తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. గ్రామస్తులు ఆయనకు స్వాగతం పలికి పూలమాల శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అర్చకులు కృష్ణమోహన్ శర్మ, మణికంఠశాస్త్రి, ఉమా మహేశ్వర శర్మ, దశరథరామశర్మ, సాయినాధశర్మ అక్షతారోపణము కళ్యాణ మంత్రాలు చదివారు. పెద్ద ఎత్తున మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

టైర్ల దొంగ అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి

గరుడ టైర్ల కంపెనీలో టైర్ల దొంగతనం చేసిన దొంగను అరెస్ట్ చేసినట్లు డిఎస్‌పి కేశవ్ప తెలిపారు. బుధవారం స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కొక్కంటి క్రాస్‌కు చెందిన కృష్ణమూర్తి స్థానిక గరుడ టైర్ల కంపెనీలో పనిచేస్తూ కొన్ని రోజుల క్రితం వారి వద్ద ఉద్యోగం మానేశాడని తెలిపారు. కంపెనీ డూప్లికెట్ కీస్ రెడీచేసుకుని రూ.6.5లక్షల విలువైన 380టైర్లను ఇటీవల కంపెనీలో చోరీచేశాడని తెలిపారు. చోరిపై కంపెనీ మేనేజర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన సిఐ నిందితున్ని నక్కలదిన్నె వద్ద అరెస్టు చేచినట్లు తెలిపారు. చోరీ చేసిన టైర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిఐ మహబూబ్‌బాషా, ఎస్ఐ హరి హరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.